సాక్షి
జోగులాంబ గద్వాల
శుక్రవారం ၊ 8 ၊ ఆగస్టు ၊ 2025



ఆర్డినెన్స్ తిరస్కరణ దుర్మార్గం

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను గవర్నర్ తిరస్కరించడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు.

-8లో ▸



కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

ధన్వాడ కేజీబీవీ విద్యార్థినులు సృజనాత్మకతకు పదునుపెట్టి చూడముచ్చటైన రాఖీలను తీర్చిదిద్దారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /25.4

వాతావరణం

ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జోగుళాంబ ఆలయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పూజలు



అలంపూర్: దక్షిణ కాశీ అలంపూర్ క్షేత్ర ఆలయాలను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు గురువారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే బాలబ్రహ్మేశ్వర స్వామి జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించారు. వీరితోపాటు చల్లా ఆదిత్యరెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గోపాల్, నాయకులు రఘు రెడ్డి, సదానందమూర్తి, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

➩ ఆంధ్రప్రదేశ్–తెలంగాణ సీజీఎం, అంబుడ్స్‌మెన్ డాక్టర్ సింగాల సుబ్బయ్య, పృథ్వీఫాల్గుణి, కిరణ్ జార్జ్‌లతో కలిసి గురువారం దర్శించుకున్నట్లు ఈఓ పురేందర్ కుమార్ తెలిపారు. ఆలయ అధికారులు అర్చకులతో కలిసి స్వాతం పలికారు. ఈ సందర్భంగా వారు శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించారు.

108 సేవలను సద్వినియోగించుకోవాలి

గట్టు: ఆపద సమయంలో ఆదుకునేందుకు 108 సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయని, వీటి సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని 108 జిల్లా అధికారి రత్నమయ్య తెలిపారు. గురువారం గట్టులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 108 వాహనాన్ని, రికార్డులను ఆయన తనిఖీ చేశారు. ఆక్సిజన్, వైద్య పరికరాలు, మందులు తదితర వాటిని పరిశీలించారు. అత్యవసర సమయంలో 108కు కాల్ చేస్తే క్షణాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకుంటుందని, ప్రజలు వీటి సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. వాహనం పూర్తిగా సిద్ధంగా ఉండే విధంగా డ్రైవర్‌తో పాటుగా సిబ్బంది చూసుకోవాలని ఆదేశించారు.

క్షయ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

గద్వాల క్రైం: క్షయ వ్యాధి నిర్మూలనకు వైద్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి సిద్ధప్ప అన్నారు. గురువారం క్షయ అనుమానితులకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్షయరహిత జిల్లాగా మార్చుకునేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

రొయ్యల సాగు ప్రశ్నార్థకం



గద్వాల శివారులోని జములమ్మ రిజర్వాయర్

సీడ్ కోసం బడ్జెట్ కేటాయించని ప్రభుత్వం

- ఎదురుచూస్తున్న మత్స్యకారులు
- గతేడాది ఆర్థికంగా నష్టపోయిన వైనం

గద్వాల వ్యవసాయం: జిల్లాలో గడిచిన ఏడాది రొయ్యల సీడ్‌ను వదలలేదు. ఈ ఏడాది అయినా రొయ్యల సీడ్‌ను వదలుతారా.. అని మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 93 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 7162 మంది మత్స్యకారులు ఉన్నారు. ఈ కుటుంబాలకు చేపలు, రొయ్యల పెంపకం, విక్రయించడమే జీవనాధారం. జిల్లాలో కృష్ణా, తుంగభద్ర నదులు, జూరాల ప్రాజెక్ట్, శ్రీశైలం బ్యాక్ వాటర్, ఆరు రిజర్వాయర్లు, 38 నోటిఫైడ్ చెరువులతో పాటు చిన్న చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిలో ఏటా మత్స్యశాఖ అందించే చేపల, రొయ్యల సీడ్‌ను వదిలి పెంచుతున్నారు.

పైలెట్ ప్రాజెక్ట్‌గా..

ఏడేళ్ల క్రితం రొయ్యల పెంపకంపై మత్స్యశాఖ దృష్టి పెట్టింది. జిల్లాలోని వాతావరణం, జలాశయాల్లోని నీటి సాంద్రత, అందులో ఉండే లవణాలు తదితర అంశాలపై కొంత సమాచారం తీసుకున్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా 2019–20లో జూరాల జలాశయంలో 6లక్షల రొయ్యల సీడ్‌ను వదలగా.. బాగా పెరిగాయి. దీంతో మత్యశాఖ అధికారులు ఏటా రొయ్యల సీడ్‌ను వదిలే సంఖ్యను పెంచుతూ వచ్చారు.

జిల్లాలో రొయ్యల సీడ్ సాగు ఇలా..

ఏడాది	వదిలిన రొయ్యల సీడ్ సంఖ్య
2019-20	6,00,000
2020-21	9,00,000
2021-22	22,00,000
2022-23	23,00,000
2023-24	32,00,000
2024-25	బడ్జెట్ కేటాయించలేదు
2025-26	బడ్జెట్ కేటాయించలేదు

ఈసారైనా వదలుతారా..

రొయ్యలసాగు, ఉత్పత్తిలో భాగంగా రొయ్య సీడ్ కోసం ప్రభుత్వం మత్స్యశాఖకు బడ్జెట్ కేటాయిస్తుంది. ఈబడ్జెట్‌తో రొయ్యల సీడ్‌కు సంబంధించి మత్స్యశాఖ రాష్ట్ర స్థాయిలో టెండర్లు ఆహ్వానిస్తుంది. టెండర్లు దక్కించుకునే కాంట్రాక్టర్ ఆయా జిల్లాలకు నిర్దేశించిన సీడ్ సంఖ్య ప్రకారం సప్లై చేస్తాడు. ఒక రొయ్య సీడ్ రూ.2 నుంచి రూ.2.50పైసల వరకు గడిచిన 2023–24 వరకు ఉండింది. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రొయ్యల సీడ్‌కై ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదు. దీనివల్ల గడిచిన ఏడాది రొయ్యలను వదలలేదు. ఈఏడాది సైతం అదే పరిస్థితి కనిపిస్తోంది. ఇంతవరకు రొయ్యల సీడ్‌కు అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించలేదు. ఫలితంగా ఈఏడాది సైతం రొయ్యల సీడ్ వదిలే విషయం పశ్నార్థకంగా మారింది.

సమాచారం లేదు



జిల్లాలోని జలాశయాలు రొయ్యల ఉత్పత్తికి అనుకూలంగా ఉన్నాయి. అయితే 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబధించి రొయ్యల సీడ్ కోసం టెండర్ల నిర్వహణకు సంబంధించిన సమాచారం మాతో లేదు.

– షకీలా బానో, జిల్లా మత్స్యశాఖ అధికారి

మత్స్యకారులకు నష్టం

రొయ్యలు బోన్‌లెస్‌గా ఉంటాయి. దీంతో వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. గద్వాల ప్రాంతంలో కేజీ రూ.300 నుంచి రూ.400 వరకు ధరలున్నాయి. అయితే రొయ్యల సీడ్ వదిలిన ఆరు, ఏడు నెలల తర్వాత రిజర్వాయర్ పరిధిలోని మత్స్యపారిశ్రామిక సంఘాల్లోని మత్స్యకారులు వలల ద్వార పట్టుకొని విక్రయిస్తారు. చేపలు, రొయ్యల పెంపకం, విక్రయం ద్వార ఆధార పడి ఇక్కడి మత్స్యకారలు జీవనం సాగిస్తున్నారు. మధ్యరాత్రి రిజర్వాయర్లలోకి వెళ్లి వలలు కట్టి, తిరిగి తెల్లవారుజామున వలలో పడ్డ రొయ్యలను తీసి, మార్కెట్‌లో విక్రయించి వచ్చిన డబ్బుతో కుటుంబాన్ని పోషిస్తారు. కాగా రొయ్య సీడ్‌ను వదలకపోవడం వల్ల మత్స్యకారులు గడిచిన ఏడాది ఆర్థికంగా నష్టపోయారు. ఐదేళ్ల రొయ్యల ఉత్పత్తిని బట్టి గడిచిన ఏడాది 286 టన్నుల ఉత్పత్తి నష్టపోయారు. ఈ ఏడాది సైతం వదలకపోతే మరోసారి మత్స్యకారులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడనుంది.

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ డీఈ

- రూ.11 వేలు తీసుకుంటూ పట్టుబడిన అధికారి

అలంపూర్: కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఇరిగేషన్ డీఈ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని రక్షణ గోడ మరమ్మతు, ఇతర పనులను కాంట్రాక్టర్‌కు రూ.4 లక్షలకు అప్పగించారు. అయితే రెండురోజుల క్రితం కాంట్రాక్టర్ పనులకు సంబంధించిన ఎంబీ బుక్ మెజర్మెంట్ చేయడానికి ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్ నాయుడును కలిశారు. ఈ క్రమంలో డీఈ రూ.12 వేలు లంచం అడగగా.. పనుల్లో నష్టం వచ్చిందని అన్ని డబ్బులు ఇవ్వలేనని చెప్పడంతో రూ.11 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా.. వారి సూచన మేరకు గురువారం కాంట్రాక్టర్ ఇరిగేషన్ కార్యాలయంలో డీఈకి డబ్బులు ఇస్తుండగా.. అప్పటికే అక్కడ ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామన్నారు. ఎవరైనా అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నం.1064, వాట్సప్ నం.94404 46106కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ సూచించారు.



ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్‌నాయుడు

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి



చేనేత ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

- కలెక్టర్ సంతోష్
- ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

గద్వాల టౌన్: చేనేత రంగంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఎక్కడా లేని విధంగా ఈ రంగంలోని ప్రతి ఒక్కరి సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని కలెక్టర్ సంతోష్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని చెప్పారు. గద్వాల జరీ చీరలు ఖండాంతర ఖ్యాతిని పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. చేనేత అందాలు మన సంస్కృతికి చిహ్నాలన్నారు. వారసత్వంగా వచ్చిన చేనేతను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించేలా ప్రోత్సహించాలన్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్టు, మింత్రా తదితర కంపెనీల ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా గద్వాల చేనేత విశ్వవ్యాప్తం అయిందని, దీన్ని మరింత విస్తృతం చేయడానికి కృషిచేస్తామన్నారు. జిల్లాలో 2,950 మగ్గాలకు జియోట్యాగ్ ఉందని చెప్పారు. నేతన్నకు చేయూతలో ఆరు వేల మంది కార్మికులు ఎంపికయ్యారన్నారు. చేనేత రుణమాఫీలో 1,761 మంది కార్మికులకు రూ. 12 కోట్లు మంజూరయ్యాని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దేశ వ్యాప్తంగా తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు మాత్రమే ఎంపికయ్యాయని, అందులో గద్వాల చీరలకు ప్రాధాన్యత లభించడం హర్షించదగిన విషయమన్నారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి

ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చేనేత వస్తలను ధరించి చేనేత రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని నేతన్నలకు అన్ని రకాలుగా ప్రోత్సాహం అందిస్తామన్నారు. చేనేత జౌళిశాఖ అధికారి గోవిందయ్య చేనేత అభివృద్ధిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు అందుబాటులో ఉండటం లేదని, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు, రాయితీలను అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఇదిలాఉండగా, అంతకుముందు చేనేత, జౌళీశాఖ అధ్వర్యంలో పట్టణంలో ర్యాలీని ఎమ్మెల్యేతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి ప్రధాన రహదారుల గుండా చేనేత కార్మిక సంఘం ప్రతినిధుల ర్యాలీ కొనసాగింది. అనంతరం చేనేత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో వృత్తి నైపుణ్యాలు కనబర్చిన పలువురు చేనేత కార్మికులకు ప్రశంసా పత్రం అందజేశారు. వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. చేనేత వస్త్రాలతో విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్‌షో ఆకట్టుకుంది. కార్యక్రమంలో చేనేత శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య, చేనేత క్లస్టర్ చైర్మన్ రామలింగేశ్వర కాంప్లే తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గద్వాలటౌన్: విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. గురువారం జమ్మిచేడ ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల చేత ఇంగ్లీష్ పాఠాలు చదివించారు. టీచర్లు బాగా చెబుతున్నారా అని ఆరా తీశారు. బాగా చదువుకోవాలని విద్యార్థినీలకు సూచించారు.



ఆకట్టుకున్న విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

చేనేత ఫ్యాషన్ షో

-8లో ▸

వైభవంగా పవిత్రోత్సవాలు



బీచుపల్లి కోదండరామస్వామి ఆలయ యాగశాలలో హోమం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజైన గురువారం సుదర్శన్ నారాయణన్ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, విశేష తిరువారాదన, సన్నాయి వాయిద్యాల నడుమ పవిత్రమాలలతో గ్రామోత్సవం, యాగశాల ద్వారా తోరణ, ధ్వజకుంభారాదనలు, మహాకుంభ ఆరాదనలు, పవిత్ర ప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు, పవిత్ర ఆదివాస హోమాలు, లఘు పూర్ణాహుతి, మహా నైవేద్య నీరాజనములు, తీర్థ ప్రసాదగోష్ఠి వంటి పూజలు చేశారు. సాయంకాలం దివ్యప్రబంధ పారాయణం, యాగశాల ఆరాదనలు, నిత్యహోమం, శ్రీరామ మూలమంత్ర గాయత్రీ హోమం, లఘు పూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతం

బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. ఆసక్తి గల భక్తులు కార్యాలయంలో రూ.1516 చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని, అప్పుడే పూజకు అవసరమైన సామగ్రిని ఇవ్వనున్నట్లు తెలిపారు.


సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మల్దకల్: గొర్రెలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై కాపర్లు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం మండలంలోని అమరవాయిలో నిర్వహించిన ఉచిత నీలినాలుక వ్యాధి నిరోధక టీకాల పంపిణీ నిర్వహించగా ఆయన తనిఖీ చేశారు. నీలి నాలుక వ్యాధి సోకిన వెంటనే జీవాలకు జ్వరం తీవ్రత పెరిగి చనిపోయే ప్రమాదముందన్నారు. వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే నీలినాలుక వ్యాధి సోకకుండా రైతులు గొర్రెలకు ముందస్తుగా టీకాలను వేయించాలన్నారు. అనంతరం ఆ గ్రామంలో 12,56 గొర్రెలు, మేకలకు నీలి నాలుక నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో పశు వైద్య అధికారి ఉషా, సిబ్బంది భీమయ్య, గోవర్ధన్, మధు, గోపాల్, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరుకు ఆటుపోట్లు

- ఇళ్లు ఖాళీ చేయని నార్లాపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులు
- జలాశయంలో ఇప్పటికే నాలుగు టీఎంసీల నీటి నిల్వ
- ప్రాజెక్టు ద్వారా నీటిని ఎత్తిపోస్తే ఇళ్లు మునిగిపోయే ప్రమాదం
- ఒకవేళ నింపినా.. ఏదులకు తరలించేందుకు అడ్డంకులు

ఇప్పట్లో నీటి ఎత్తిపోతలకు కనిపించని అవకాశాలు



పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్ చానల్ వద్ద శ్రీశైలం బ్యాక్ వాటర్

కొల్లాపూర్: పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీటి ఎత్తిపోతలు ఇప్పట్లో చేపట్టేలా కనిపించడం లేదు. ఇందుకు ప్రధానంగా పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు పంప్ హౌజ్ పనులు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ నీటి ఎత్తిపోతలు మాత్రం రెండేళ్లుగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కచ్చితంగా నీటి ఎత్తిపోతలు చేపట్టాలని అధికారులు భావించినా.. ఆచరణకు నోచుకోలేదు. ఈ క్రమంలో ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఈ ఏడాది ఆఖరి వరకు ఎత్తిపోతల కోసం ఎదురుచూడక తప్పేలా లేదు.

పరిహారం చెల్లించాకే..

నార్లాపూర్ రిజర్వాయర్‌లో అంజనగిరి, వడ్డెగుడిసెలు, సున్నపుతండా గ్రామాలు ముంపునకు గురవుతున్నాయి. వీరిలో కొంతమందికి సరైన పరిహారం అందలేదు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్ ప్రకారం తమకు పరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను ఇటీవలే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. వారికి పరిహారం ఇప్పించేందుకు చర్యలు చేపట్టారు. అయితే తమకు పూర్తిస్థాయి పరిహారం అందిన తర్వాతే ఖాళీ చేస్తామని నిర్వాసితులు చెబుతున్నారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు అధికారులు కొత్తగా నీటి ఎత్తిపోతలు చేపట్టే ఆలోచనను విరమించుకున్నారు. ఒకవేళ నీటిని ఎత్తిపోస్తే సున్నపుతండాలో ఇళ్లు మునిగిపోయే ప్రమాదం ఉండటంతో అధికారులు వాయిదా వేస్తున్నారు.


నాలుగు మోటార్ల బిగింపు..

ప్రాజెక్టులోని మొదటి లిఫ్టు ఎల్లూరు పంపుహౌజ్‌లో ఇప్పటి వరకు నాలుగు మోటార్లు బిగించారు. మూడు మోటార్ల పనులన్నీ పూర్తి కాగా.. మరో మోటార్‌కు డ్రై ట్రయల్స్ నిర్వహించాల్సి ఉంది. లిఫ్టులో ఇంకో నాలుగు మోటార్ల బిగింపు పనులు కొనసాగుతున్నాయి. డెలివరీ మెయిన్స్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. ప్రాజెక్టు వద్ద 400/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

నార్లాపూర్‌లో నీటి నిల్వ ఇలా..

నార్లాపూర్ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 6.4 టీఎంసీలు. ప్రస్తుతం పూర్తయిన పనుల ప్రకారం మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవకాశం ఉంది. దీంతో నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి 4 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది తరలింపునకు కేఆర్‌ఎంబీ అనుమతులు సైతం ఉన్నాయి. అయితే గతంలో నార్లాపూర్ రిజర్వాయర్‌లో 2 టీఎంసీల నీటిని నిల్వ చేశారు. ఇటీవల కాలంలో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోసిన నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి మళ్లించడంతో నీటి నిల్వ 4 టీఎంసీలకు పెరిగింది. రిజర్వాయర్‌లోకి కొత్తగా నీటిని ఎత్తిపోస్తే పలు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వం దృష్టిలో ఉంది..



నార్లాపూర్ రిజర్వాయర్‌లో ఇప్పటికే 4 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ఈ రిజర్వాయర్‌లోకి మరిన్ని నీళ్లు ఎత్తిపోస్తే నిర్వాసితుల ఇళ్లు మునిగిపోతాయి. కానీ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు పూర్తయితేనే ఇళ్లు ఖాళీ చేస్తామంటున్నారు. ఈ సమస్య ప్రభుత్వం దృష్టిలో ఉంది. త్వరలోనే అన్ని సమస్యలను అధిగమించి ఈ సీజన్ ముగింపులోగా ఎత్తిపోతలు చేపడుతాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

రెండేళ్ల క్రితమే ప్రారంభం..

పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టును 2023 సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ఎల్లూరు సమీపంలోని పంప్‌హౌజ్‌లో ఒక మోటార్ ఆన్‌చేసి నీటి ఎత్తిపోతలు చేపట్టి 2 టీఎంసీల నీటిని నార్లాపూర్ రిజర్వాయర్‌కు తరలించారు. తాగునీటి అవసరాల కోసం గతేడాది 4 టీఎంసీల వరకు నీటిని ఎత్తిపోసుకునేందుకు అనుమతులు ఉన్నాయి. అయితే పంప్‌హౌజ్‌లో మోటార్ల బిగింపు, సివిల్ వర్క్స్, విద్యుత్ సరఫరా పనులు పెండింగ్‌లో ఉండటంతో ఎత్తిపోతలు జరగలేదు.

ముందుకు పారించే వీలులేక..

నిర్వాసితుల సమస్యను అధిగమించి నార్లాపూర్ రిజర్వాయర్‌ను నింపినా.. ఆ నీటిని ఏదుల రిజర్వాయర్‌కు తరలించేందుకు అవకాశం లేదు. నార్లాపూర్ రిజర్వాయర్ సమీపంలో కుడికిళ్ల, తీర్నాంపల్లి శివార్లలో 3 కి.మీ., మేర కాల్వ (దాదాపు 20 లక్షల క్యూబిక్ మీటర్ల మేర) తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. ప్యాకేజీ–3 లోభాగంగా ఈ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు కంపెనీ నిధులు సరిపోలేదనే సాకుతో మధ్యలోనే నిలిపివేసింది. దీంతో ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఇటీవల కాల్వ పనులు పూర్తి చేసేందుకు రూ.వంద కోట్లకు పైగా నిధులు కేటాయించింది. గత నెలలోనే పనులు ప్రారంభం కాగా.. 6 లక్షల క్యూబిక్ మీటర్ల మేర పూర్తి చేశారు. మరో 14 లక్షల క్యూబిక్ మీటర్ల తవ్వకాలు జరగాలి. ఈ కాల్వ పూర్తయితేనే నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు నీటిని తరలించవచ్చు. అప్పటి వరకు పాలమూరు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోతలు జరిగే అవకాశాలు కనిపించడం లేదు.

స్ట్రాంగ్‌రూం వద్ద పటిష్ట భద్రత

గద్వాల న్యూటౌన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఉంచాలని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ను కలెక్టర్ సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును చూశారు.





అదిరేటి డ్రెస్సు.. మేమేస్తే..

ఫ్యాషన్ అంటే కేవలం పాశ్చాత్య దుస్తులే కాదు.. మార్కెట్‌లోకి అప్పుడే దిగిన ట్రెండింగ్ రూపాలు. మారుతున్న కాలానికి యువత ఆలోచన, అభిప్రాయాలు కూడా మారుతున్నాయి. సందర్భం.. అభిరుచి.. సాంస్కృతిక నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జోగులాంబ గద్వాల జిల్లా చేనేత, జౌళి శాఖ గురువారం విద్యార్థులకు ఫ్యాషన్ షో నిర్వహించింది. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమం చూపరులను కట్టిపడేసింది. సంప్రదాయ చేనేత, పట్టు వస్త్రాలు ధరించి విద్యార్థులు ర్యాంప్‌వాక్ చేశారు. చేనేత కళకు ఆధునికతను జోడించి సరికొత్తగా రూపొందించిన వస్త్ర శ్రేణి ఫ్యాషన్ ఆహుతులను ఆకట్టుకుంది. అమ్మాయిల చీర కట్టు, అబ్బాయిల పంచెకట్టు అదరహో అనిపించాయి. మరికొందరు భారతీయ సాంప్రదాయ దుస్తులతో పాటు సామాజిక అంశాలను వివరిస్తూ వస్త్రాలను ధరించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించిన కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి విద్యార్థులను ప్రశంసించారు. - గద్వాల టౌన్

క్లుప్తంగా

వీడియో కాల్ చేసి.. యువకుడి ఆత్మహత్య


మహ్మద్ మేరాజ్ (ఫైల్)

జడ్చర్ల: అప్పులు చేస్తున్న కుమారుడిని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఆ కుమారుడు.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మిత్రుడికి వీడియో కాల్ చేసి రైలు కింద పడి మృతిచెందిన ఘటన జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. రైల్వే ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. తిమ్మాజిపేట మండల కేంద్రానికి చెందిన మహ్మద్ మేరాజ్ (25) ఓ ప్రైవేట్ మొబైల్ సరీ్వస్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అయితే అవసరాల నిమిత్తం అప్పులు చేయగా.. ఆ విషయం ఇంట్లో తెలిసింది. దీంతో అప్పులు చేయవద్దంటూ తండ్రి మందలించాడు. ఈక్రమంలో బుధవారం తిమ్మాజిపేటలోని ఇంటి నుంచి తన మిత్రుల దగ్గరకు వెళ్తున్నానంటూ మేరాజ్ బయలుదేరి జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు పట్టాల దగ్గరకు చేరుకున్నాడు. తన మిత్రుడికి వీడియో కాల్ చేసి.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. మిత్రుడు చనిపోవద్దంటూ వారిస్తూ తన తోటి మిత్రులతో కలిసి రైలు పట్టాల వద్దకు వచ్చే సరికే పట్టాల పక్కన విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.కాగ కుమారుడి మరణవార్త తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి


కీర్తి (ఫైల్)

మల్దకల్: ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మల్దకల్ గ్రామానికి చెందిన తిమ్మప్ప, సరిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. కాగా గురువారం చిన్న కుమార్తె కీర్తి(2) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయింది. తర్వాత గమనించిన కుటుంబ సభ్యులు పాప కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతకగా సంపులో అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే చిన్నారిని బయటికి తీసి గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి కార్మికుడు మృతిచెందిన ఘటన గురువారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన వడ్డె వీరన్న (53) ఉదయం భీంనగర్ కాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనులకు తోటి కార్మికులతో కలిసి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు వస్తూ ప్రమాదవశాత్తు పైఅంతస్తు నుంచి కిందపడ్డాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు.

అడవి జంతువు దాడిలో లేగ మృతి

ధరూరు: అడవి జంతువు దాడిలో లేగ మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం లో గురువారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన రైతు కొత్తింటి వెంకటప్ప రోజులాగే తన పశువులను బుధవారం పొలం వద్ద కట్టేసి ఇంటికి వెళ్లారు. గురువారం ఉదయం పొలం వద్దకు రాగా లేగ మృతిచెంది కనిపించింది. అటవీ అధికారులు స్థలాన్ని పరిశీలించి హైనా దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ తిరస్కరించడం దుర్మార్గం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను రాష్ట్ర గవర్నర్ తిరస్కరించడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అమలుకు అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినా పట్టించుకోకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడుతున్నాయని, తద్వారా గ్రామాల అభివృద్ధి కుంటుపడుతుందని ఆరోపించారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రజా పోరాటాల ద్వారానే కమ్యూనిస్టు పార్టీ విస్తరిస్తుందన్నారు. బనకచర్ల విషయంలో రెండు పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని, నది జలాల్లో మిగులు, వరద జలాల్లో తెలంగాణ వాటా పరిష్కారమైన తర్వాతే బనకచర్ల నిర్మాణం చేపట్టాలని, కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ రిపోర్టు బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికల్లో 65 లక్షల ఓట్లను తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రపంచంలో సామ్రాజ్యవాద బృందానికి నాయకత్వం వహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యా నుంచి భారతదేశం ఆయిల్ కొనుగోలు చేయరాదని ఆంక్షలు విధిస్తూ, 50 శాతం పన్నులను విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఒక దేశ సార్వభౌమత్వంలో అమెరికా పెత్తనాన్ని సహించం అన్నారు. దీని వల్ల వ్యవసాయం, ఫార్మా తదితర రంగాల్లో తీవ్ర సంక్షోభం ఏర్పడుతుందని, దీనిపై పార్లమెంట్‌లో ప్రధాని మోదీ విదేశాంగ విధానాన్ని ప్రకటించాలని, అమెరికా పట్ల తన వైఖరిని వెల్లడించాలన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రజా సమస్యలు తీసుకొని పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జిల్లాలో బహుముఖ పోరాటాలు చేపట్టాలని, సమస్య ఎక్కడుంటే కార్యకర్తలు అక్కడ ఉండాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ, చంద్రకాంత్, రాజ్‌కుమార్, మోహన్, జగన్, వేణుగోపాల్, ఆర్. రాంరెడ్డి, వల్లభాపురం జనార్దన్, కమర్ అలీ ఖాజా మైనొద్దీన్, ఖయ్యూం, చంద్రమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఫోరం అధ్యక్షుడు రాజసింహుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరానికి ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం కృషి చేస్తుందని అధ్యక్ష, కార్యదర్శులు రాజసింహుడు, రవీందర్‌రెడ్డి అన్నారు. స్థానిక తెలంగాణ చౌరస్తాలోని రెడ్‌క్రాస్ భవన్‌లో గురువారం నిర్వహించిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు చనిపోతే దహన సంస్కారాలకు ఇచ్చే రూ.5 వేలను రూ.20 వేలకు, తదుపరి రూ.30 వేలకు పెంచేలా తమ ఫోరం కృషి చేసిందన్నారు. అలాగే జీవితకాలపు స్మార్ట్ ఐడెంటిటీ కార్డులు, ఆయా జిల్లాలోని విశ్రాంత ఉద్యోగుల ముఖచిత్రాలను స్థానిక ఆర్టీసీ క్లినిక్‌లలోని కంప్యూటర్లలో నిక్షిప్తం చేసే విధానాన్ని యాజమాన్యం చేత ప్రవేశపెట్టించింది తమ ఫోరమేనని స్పష్టం చేశారు. జిల్లాలోని రెండు ఆర్టీసీ క్లినిక్‌లలో డాక్టర్ల నియామకం, మందుల సరఫరా పెరుగుదల, కనీస పెన్షన్ పెంపు కోసం తమ ఫోరం ఆధ్వర్యంలో నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు వివరించారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, అధ్యక్షుడిగా రాజసింహుడు, ఉపాధ్యక్షులుగా భగవంతు, జీఎస్ రెడ్డి, లలితమ్మ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా అంజన్న, బషీరుద్దీన్, వెంకన్న, సహాయ కార్యదర్శులుగా మోహన్‌రెడ్డి, కేఎల్ డేవిడ్, జహంగీర్, కోశాధికారిగా బుచ్చన్న, సలహాదారులుగా జీబీ పాల్, వెంకట్‌నారాయణ, నాగాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌కు రెండో ఓటమి


అబ్దుల్ రాఫే (108 పరుగులు)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో బీ–డివిజన్ టూడే లీగ్ చాంపియన్‌షిప్‌లో చీర్‌ఫుల్ చమ్స్ జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు పోరాడి ఓడింది. తొలి రోజు ఆట ముగిసేసరికి 48.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసిన చీర్‌ఫుల్ చమ్స్ గురువారం 63 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 239 పరుగులు చేసింది. జిల్లా బౌలర్లు ముఖీతుద్దీన్ 3, జశ్వంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ 60.3 ఓవర్లలో 221 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో ఓపెనర్ అబ్దుల్ రాఫే బిన్ అబ్దుల్లా (108; 181 బంతుల్లో 14 ఫోర్లు) సెంచరీ, ఛత్రపతి (55) అర్ధసెంచరీ చేసినా మిగతావాళ్లు రాణించకపోవడంతో పరాజయం చవిచూసింది. పాలమూరుకు ఈ లీగ్‌లో వరుసగా రెండో ఓటమి.

తేజేశ్వర్ హత్య కేసు.. కోర్టులో నిందితుల హాజరు

ఏ–7కు బెయిల్ మంజూరు


నిందితులను కోర్టులో హాజరుపరచిన అనంతరం వాహనంలో రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

గద్వాల క్రైం: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసుకు సంబంధించి నిందితులను గురువారం గద్వాల జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపరిచారు. జూన్ 17న గద్వాలకు చెందిన ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్‌ను భార్య, ప్రియుడు కలిసి సుపారీ గ్యాంగ్ సాయంతో దారుణహత్య చేయించిన విషయం విధితమే. ఈక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా జైల్‌లో రిమాండ్‌లో ఉన్న నిందితులు ఏ1 తిరుమలరావు, ఏ2 ఐశ్వర్య అలియాస్ సహస్ర, ఏ3 కుమ్మరి నగేష్, ఏ4 చాకలి పరుశరాముడు, ఏ5 చాకలి రాజు, ఏ6 మోహన్, ఏ7 తిరుపతయ్య (తిరుమలరావు తండ్రి), ఏ8 సుజాతలను గద్వాల జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఉదయ్‌నాయక్ ఎదుట పోలీసులు ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో కేసుకు సంబంధించి వాదనలకు న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని న్యాయమూర్తి ప్రశ్నించారు. అనంతరం నిందితులకు మరో 14 రోజులపాటు రిమాండ్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం నిందితులను జైలుకు తరలించారు. అయితే, ఈ కేసులో నిందితులను మరోసారి పోలీసులు కస్టడీలోకి తీసుకునేందుకు అప్పీలు దాఖలు చేశారు.

షరతులతో కూడిన బెయిల్ మంజూరు

ఈ కేసులో ఏ7 తిరుపతయ్య బెయిల్ కోసం గద్వాల కోర్టులో పలుమార్లు పిటిషన్ దాఖలు చేయగా.. న్యాయమూర్తి తిరస్కరించారు. అయితే, గత నెల 28వ తేదీన మరోసారి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా.. షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇదిలాఉండగా, కోర్టుకు నిందితులు హాజరైన సమయంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

గ్రామకార్యదర్శి సంతకం ఫోర్జరీ?

మహమ్మదాబాద్: బ్యాంకు రుణం కోసం గ్రామకార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మండలంలోని గాధిర్యాల్‌కు చెందిన అంజిలయ్య తండ్రి హన్మయ్య రెండేళ్ల కిందట ఇంటి నిర్మాణం ప్రారంభించారు. డబ్బులు సరిపోకపోవడంతో రుణం తీసుకోవాలని ఆశ్రయించాడు. గ్రామ పంచాయతీలో ఇంటిపన్ను అధికంగా ఉండటంతో అదే గ్రామానికి చెందిన ఇరివింటి అంజిలయ్య తండ్రి హన్మయ్య పేరున ఉన్న ఇంటి పన్ను పత్రాలపై పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి రుణం పొందినట్లు సమాచారం. ఈ విషయాన్ని గ్రామకార్యదర్శి హాజీ వద్ద ప్రస్తావించగా..సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- సొంతంగా రాఖీలు తయారు చేస్తున్న ధన్వాడ కస్తూర్బా బాలికలు
- రూ.50 ఖర్చుతో రూ.300 విలువైనవి తయారీ


రాఖీలు తయారు చేస్తున్న విద్యార్థినులు


అట్టముక్కలతో డోర్‌కు డెకరేషన్‌గా ఏర్పాటు చేసేందుకు తయారు చేసిన విద్యార్థినులు


చేతితో తయారు చేసిన రాఖీలు

ధన్వాడ: అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ. ఈ క్రమంలో రాఖీ పండుగను పురస్కరించుకొని ధన్వాడలోని కేజీబీవీ విద్యార్థినులు తమలోని సృజనాత్మకతకు పదును పెట్టారు. విద్యార్థినులు ఉలన్, గవ్వలు, ముత్యాలు, అట్ట ముక్కలు ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ గాజు సీసాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఇలా రకరకాల వస్తువులను సేకరించి వాటితో రాఖీలు తయారు చేస్తున్నారు. రూ.50 వ్యయంతో రూ.300 విలువైన రాఖీలను తీర్చిదిద్దుతున్నారు. అట్ట ముక్కలు వివిధ రూపాల్లో కట్ చేసి అందంగా తీర్చిదిద్ది ఇంటి తలుపులకు వెల్‌కం బోర్డుల మాదిరిగా ఉపయోగిస్తున్నారు. వృథా వస్తువులను ఉపయోగకరంగా మార్చడం తమకెంతో సంతోషం కలిగించిందని విద్యార్థినులు పేర్కొన్నారు.

జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూరు/శ్రీశైలం: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. బుధవారం రాత్రి 8 గంటల వరకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. గురువారం రాత్రి 8 గంటల వరకు 34 వేల క్యూసెక్కులకు పెరిగింది. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,373, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750 ఆవిరి రూపంలో 71 ఎడమ కాల్వకు 1,080, కుడి కాల్వకు 690, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు–2కు 750 భీమా లిఫ్ట్–1 650 క్యూసెక్కులతో కలిపి మొత్తం 41,829 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 9.2555 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. జలవిద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఎగువలోని 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 200.843 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 239.146 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 439.989 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

- శ్రీశైలం జలాశయంలో గురువారం 879.3 అడుగుల నీటిమట్టం వద్ద 184.2774 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,373, సుంకేసుల నుంచి 30,884 మొత్తం 68,257 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 14,400, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,615 మొత్తం 45,015 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 35,000, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 3,225, ఎంజీకేఎల్‌ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 16.844 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.253 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

కల్వకుర్తి టౌన్: వెల్దండలో బుధవారం జరిగిన పందుల పంచాయితీలో హత్యకు గురైన రాములు (45) కుటుంబానికి న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబసభ్యులు గురువారం మధ్యాహ్నం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉన్న జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. పోలీసులు నిందితులను రక్షించడంతో పాటు తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. స్థానిక అధికారపార్టీ నాయకుడి కార్యాలయంలో సెటిల్‌మెంట్ చేయడం ఏమిటని బాధితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆందోళన విరమించాలని, లేకుంటే ఎలాంటి పరిష్కారం బాధిత కుటుంబానికి చేకూరదని పోలీసులు మాట్లాడటంతో ఒక్కసారిగా న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. చివరకు కులసంఘాల నాయకులు బాధిత కుటుంబ సభ్యులు కొందరితో చర్చలు జరిపి సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం..


వెల్దండలో హత్య జరిగిన ప్రదేశంలో వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

వెల్దండ: మండల కేంద్రంలో బుధవారం రాములు హత్య జరిగిన ప్రదేశాన్ని గురువారం కల్వకుర్తి, వెల్దండ సీఐలు నాగార్జున, విష్ణువర్ధన్ రెడ్డి, క్లూస్‌టీమ్ పరిశీలించి పలు ఆధారాలు సేకరించింది. పందులు షెడ్ ఎన్ని రోజులుగా నిర్వహిస్తున్నారు.. గొడవ ఎలా జరిగిందన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశంలో పోలీసులను ఏర్పాటు చేశారు.

ఐదుగురిపై కేసు నమోదు..

రాములు హత్య ఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. రాములు భార్య బెల్లంకొండ నాగమణి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్వకుర్తి పురపాలికకు చెందిన మానుపాటి వెంకటమ్మ, ఆమె అత్త పెంటమ్మ, కుమారులు అన్వేష్, శివ, పవన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

గుప్తనిధుల కేసు.. ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మాగనూర్: గుప్తనిధుల తవ్వకాల్లో ఉపాధ్యాయుడి పాత్ర ఉండడం.. పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు తరలించిన నేపథ్యంలో అతడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ గోవిందరాజులు తెలిపారు. పూర్తి వివరాలిలా.. మాగనూర్ మండలం ఉజ్జెల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాయిబాబా.. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన 9 మంది ముఠా సభ్యులతో కలిసి గుప్త నిధుల తవ్వకాలు జరిపి పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో సదరు ఉపాధ్యాయుడిని ఈ నెల 2వ తేదీన సస్పెండ్ చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ బంగారు షాపులో బంగారం విక్రయించడానికి వెళ్లగా షాపు యాజమానికి అనుమానం వచ్చి అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో దొంగతనాలు, గుప్తనిధుల ద్వారా బంగారం లభ్యమైనట్లు ఒప్పుకున్నారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే వీరిలో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు సాయిబాబా కూడా ఉన్నారు. ఉపాధ్యాయుడు రిమాండ్‌లో ఉన్నట్లు తమకు సమాచారం రావడంతో డీఈఓ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై ఉజ్జెల్లి పాఠశాల ఉపాధ్యాయులను వివరణ కోరగా.. సదరు ఉపాధ్యాయుడు వారం రోజులుగా ఆరోగ్యం బాగోలేదని పాఠశాలకు రావడం లేదనే విషయం మాత్రమే తెలుసని.. కేసు విషయం తమకు ఇప్పుడే తెలిసిందన్నారు.

విద్యుత్ లైన్‌మేన్ సస్పెన్షన్

బాలుడి మృతి ఘటనలో విద్యుత్‌శాఖ అధికారుల చర్యలు

జడ్చర్ల: విద్యుదాఘాతంతో బాలుడు మృతిచెందిన ఘటనలో సంబంధిత లైన్‌మేన్‌ను సస్పెండ్ చేస్తూ ట్రాన్స్‌కో డీఈఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏఈఈ వెంకటయ్య గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని సరస్వతీనగర్‌కాలనీలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర అదే కాలనీకి చెందిన శ్రేయాన్ (10) జూన్ 4న విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే తన కుమారుడు మృతిచెందాడంటూ బాలుడి తండ్రి రాఘవేందర్ అదే నెల 13న సుప్రీంకోర్టులోని జాతీయ మానవ హక్కుల విభాగానికి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలంటూ జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర మానవ హక్కుల సంఘం (హెచ్‌ఆర్సీ)ని ఆదేశించింది. అదే నెల 23న బాలుడి మృతిపై వివరణ ఇవ్వాలంటూ జడ్చర్ల విద్యుత్‌శాఖ అధికారులకు హెచ్‌ఆర్సీ నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో తీవ్రంగా స్పందించింది. రాష్ట్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ల పరిస్థితి, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని విద్యుత్‌శాఖ సీఎండీని ఆదేశించింది. అంతేగాక బాలుడు శ్రేయాన్ కుటుంబానికి రూ.5 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు స్థానిక లైన్‌మెన్ మధును సస్పెండ్ చేశారు. కాగా తన కుమారుడి మృతికి పరిహారం లెక్కగట్టడం సరికాదని, బాధ్యులైన ఉన్నతాధికారులపైనా చర్యలు తీసుకోవాలని, అంతవరకు తన న్యాయ పోరాటం కొనసాగిస్తానని రాఘవేందర్ తెలిపారు.